ప్రజాశక్తి
శనివారం 26 ఏప్రిల్ 2025
5
పార్వతీపురం మన్యం

జిల్లా జడ్జిని కలిసిన ఎస్‌పి

పార్వతీపురంరూరల్ : విజయనగరం జిల్లా జడ్జిగా బాధ్యతలు స్వీకరించిన ఎం. బబితను ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టులోని తన ఛాంబర్లో జడ్జిని మర్యాదపూర్వకంగా కలిసి పూలమొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధిత ప్రజలకు న్యాయం, నిందితులకు శిక్షలు పడేలా ఇరు శాఖల అధికారులు, సిబ్బంది సమర్ధవంతంగా పని చేద్దామన్నారు.

జిల్లా జడ్జిబబితకు పూల కుండీని అందజేస్తున్న ఎస్‌పి మాధవరెడ్డి

పనులు చేయించారు... బిల్లులు మరిచారు

- ఆందోళనలో గుత్తేదారులు
- అర్ధాంతరంగా నిలిచిపోయిన అభివృద్ధి పనులు

బిల్లు మంజూరు కాకపోవడంతో నిర్మాణం మధ్యలో నిలిచిపోయిన కోసింగి పాఠశాల ప్రహరీగోడ

ప్రజాశక్తి - సీతంపేట

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి కొన్ని నెలలకే ఉపాధి హామీ పథకంలో అభివృద్ధి పనులు చకచక చేయించింది. వారం వారం బిల్లులు చెల్లించింది. దీన్ని చూసి గుత్తేదారులు పనులు చేయడానికి దూకుడుగా ముందుకొచ్చారు. అయితే 5 నెలలుగా గత బిల్లులు చెల్లించకపోవడంతో పనులు చేయడానికి కాంట్రాక్టర్లు మొహం చాటేస్తున్నారు. గత ప్రభుత్వం మాదిరిగా ఈ ప్రభుత్వం కూడా పనులు చేయించిన బిల్లులు నెలల తరబడి చెల్లించకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ఉపాధి హామీ పథకం ద్వారా ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్, పంచాయతీరాజ్ ఇంజనీరింగ్, మైనర్ ఇరిగేషన్, వ్యవసాయ శాఖ, హార్టికల్చర్ అన్ని విభాగాలకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేసింది. అయితే వీటిలో వేతనదారులకు 60 శాతం, మెటీరియల్ కాంపొండ్ పనులకు 40 శాతం కేటాయించింది. అంతవరకు బాగానే ఉంది. అటు వేతనదారులకు బిల్లులు సకాలంలో చెల్లించుకోవడంతో పాటు కాంట్రాకర్లకు నెల తరబడి బిల్లులు చెల్లించకపోవడంతో అప్పులు చేసి అభివృద్ధి పనులు చేయించామని గుత్తేదారులు గగ్గోలు పెడుతున్నారు. పనులు పూర్తి చేసిన నెల, వారం వ్యవధిలోనే బిల్లులు చెల్లిస్తేనే చిన్న చిన్న కాంట్రాక్టర్లు ముందుగా రాగలరని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది నవంబర్, డిసెంబర్ నుంచి బిల్లుల కోసం కళ్ళు కాయలు కాసేలా బిల్లులు ఎప్పుడెప్పుడు పడతాయని ఎదురుచూస్తున్నారు.

సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల 20 మండలాల్లో ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ ద్వారా అధికంగా బీటీ రహదారుల పనులు చేశారు, సిసి రోడ్లు, భవనాలు, కల్వర్టులు, పాఠశాలల ప్రహరీగోడలు తదితర అభివృద్ధి పనులు జరిగాయి. వీటిలో పాలకొండ, వీరఘట్టం, సీతంపేట, భామిని మండలాల్లో చేపట్టిన బిటి రహదారుల పనులు పూర్తి చేశారు. అయితే ఈ నాలుగు మండలాల పరిధిలో 255 పనులకు రూ.137 కోట్లు మంజూరు చేశారు. సుమారు రూ.40 కోట్ల వరకు గుత్తేదారులకు బిల్లులు చెల్లించాల్సి ఉంది. చుట్టుపక్కల మండలాల నుండి వచ్చిన కాంట్రాక్టర్లు ఐటిడిఎ ట్రైబల్ వెల్ఫేర్ ఇంజనీరింగ్ పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ కార్యాలయం చుట్టూ బిల్లులు కోసం చక్కెర్లు కొడుతున్నారు.

బిల్లులు అప్లోడ్ చేశాం

ఐటిడిఎ పరిధిలో అభివృద్ధి పనులు జరిగినంత వరకు బిల్లులు అప్లోడు చేశాం. మన్యం జిల్లాలో 105 పనులకు రూ.67 కోట్లు మంజూరు కాగా, 40 పనులు పూర్తి చేశాం. రూ.12 కోట్లు బిల్లు చెల్లించాల్సి ఉంది. మిగతా పనులు వివిధ దశల్లో ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలో 150 పనులకు గానూ రూ.70 కోట్లు మంజూరు కాగా, 25 పనులకు టెక్నికల్ శాంక్షన్ రాలేదు. ఈ పరిధిలో రూ.20 కోట్లు బిల్లులు చెల్లించాల్సి ఉంది. శ్రీకాకుళం జిల్లాలో కూడా పనులు కొన్ని పూర్తయ్యేవి మరికొన్ని వివిధ దశల్లో ఉన్నాయి.

పి.రమాదేవి,
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్,
ట్రైబల్‌వెల్ఫేర్, సీతంపేట.

గృహ నిర్మాణాల్లో పురోగతి ఉండాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో గృహ నిర్మాణ సంస్థ ద్వారా చేపడుతున్న ఇళ్ల నిర్మాణాల్లో ప్రతి వారం పురోగతి కనిపించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ సంబంధిత అధికారులను ఆదేశించారు. పిజిఆర్ఎస్, హౌసింగ్, నరేగా, తాగునీటి సమస్యలు, గ్రామ/వార్డు సచివాలయాల కార్యకలాపాలు, పెన్షన్ పంపిణీ, పాజిటివ్ పబ్లిక్ పర్సెప్షన్ తదితర అంశాలపై కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో పిఎం జన్‌మన్ కింద చేపట్టిన గృహాలకు రూ.50వేల నుంచి లక్ష రూపాయల వరకు అదనంగా మంజూరు చేస్తున్నప్పటికీ ప్రగతి కనిపించడం లేదన్నారు. జిల్లాలోని లే అవుట్లలో నిర్మితమవుతున్న గృహాల్లో ఆర్సీ, ఆర్ఎల్ స్టేజీలో 3,149 గృహాలు ఉన్నాయని, వాటిపై మండల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, ఎఇఇలు ప్రత్యేక దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేయాలని ఆదేశించారు. ప్రతి వారం 100 గృహాలకు పైగా ప్రారంభమయ్యేలా చూడాలన్నారు. కొన్ని లే అవుట్లలో నీటి సమస్య ఉందని, వాటికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. నిర్మాణాలకు ఇది అనువైన సమయమని, కావున ఆగస్టు నాటికి పూర్తికావాలని కలెక్టర్ తేల్చిచెప్పారు.

జిల్లాలో రోజు రోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతున్నాయని, కావున చలివేంద్రాలు అన్ని చోట్లా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పని ప్రదేశాలు, ఉపాధి హామీ, రద్దీ ప్రాంతాలు, బస్టాండ్ తదితర ప్రదేశాల్లో చలివేంద్రాలు కచ్చితంగా ఉండాలని, వాటిని పంచాయతీ అధికారులు ఏర్పాటు చేయాలని తెలిపారు. జిల్లాలో ఎవరికీ వడదెబ్బ తగల కూడదని, అలా జరిగితే సంబంధిత ఆర్‌డబ్ల్యుఎస్, ఎంపిడిఒ, ఎంఆర్ఓలను బాధ్యులను చేస్తామని కలెక్టర్ హెచ్చరించారు. అలాగే ఎక్కడా తాగునీటి సమస్య ఉండరాదని, ఎప్పటికప్పుడు బోర్ వెల్స్ కు మరమ్మతులు చేపట్టడం, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించాలని తెలిపారు. పశువుల కొరకు నీటి తొట్టెలను ఏర్పాటుచేసి వాటికి కూడా నీటిని అందించాలని అన్నారు. పింఛన్ల పంపిణీ సమయంలో పింఛనుదారులు అసంతృప్తి చెందకుండా ప్రతి మండలంలోని ప్రత్యేక అధికారులు పింఛన్ల పంపిణీ రోజున పాల్గొని ఉదయం 10గంటల్లోగా శత శాతం పంపిణీ కావాలని అన్నారు. జిల్లాలో 1,521 కొత్తగా వితంతు పింఛన్లు మంజూరయ్యాయని, కావున ఆయా మండలాల్లోని కొత్త పింఛన్ల సొమ్మును కూడా ముందుగా డ్రా చేసుకోవాలని తెలిపారు. ప్రజాప్రతినిధులతో కొత్త పింఛన్లను పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వివరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలకు క్షేత్ర స్థాయిలో పరిశీలించి శాశ్వతమైన, నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహిస్తున్న క్యాంపేయిన్లలో ఇచ్చిన లక్ష్యాలను శత శాతం సాధించాలని, లేకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ తెలిపారు. ఉపాధి హామీ పనుల్లో ఫారం పాండ్స్, చెక్ డ్యాములు, గోశాలలు తదితర ఉపాధి పనులపై ప్రత్యేక దష్టి సారించాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఎస్.ఎస్.శోబిక, సబ్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్ఒ కె.హేమలత, హౌసింగ్, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు పి.ధర్మచంద్రా రెడ్డి, ఎం.సుధారాణి, కె.రామచంద్రరావు, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.అప్పన్న, ఎపిఇపిడిసిఎల్ ఎస్ఇ కె.చలపతిరావు, డిపిఒ టి.కొండలరావు, జిల్లా ఆర్.డబ్ల్యూ.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ.ప్రభాకర రావు, సిపిఒ పి.వీర్రాజు, మండల ప్రత్యేక అధికారులు, వివిధ శాశాల అధికారులు, ఎపిఒలు, తహశీల్దార్లు, ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఇతర జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

డ్రోన్లపై రైతులకు అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

కిసాన్ డ్రోన్లపై అవగాహన పెంపొందించుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

కిసాన్ డ్రోన్లతో రైతులకు ఎంతో మేలు కలుగుతుందని, కావున వాటిపై రైతులు, పైలెట్లు పూర్తిస్థాయిలో అవగాహన పెంపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ పిలుపు నిచ్చారు. శుక్రవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో కిసాన్ డ్రోన్ల అవగాహన కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించే పద్ధతిని రైతులు, పైలెట్లతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాకు ఆరు కిసాన్ డ్రోన్లు మంజూరయ్యాయని, రైతులు గ్రూపుగా ఏర్పడి వీటిని కొనుగోలు చేసుకోవచ్చని అన్నారు. ఒక్కో యూనిట్ ధర రూ. 10 లక్షలు కాగా, రూ. 8లక్షలు వరకు సబ్సిడీ ఉంటుందని, మిగిలిన మొత్తాన్ని బ్యాంకు రుణంగా పొందవచ్చునని తెలిపారు. రైతుల సౌలభ్యం కొరకు డ్రోన్లు సరఫరా చేసే రెండు కంపెనీలు, బ్యాంకర్లు కూడా ఈ సదస్సులో పాల్గొన్నారని తెలిపారు. కావున రైతులు, వీటిని వినియోగించే పైలెట్లు కిసాన్ డ్రోన్ల పట్ల పూర్తి అవగాహన చేసుకోవాలని, సందేహాలు ఉంటే నివృత్తి చేసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి కె.రాబర్ట్‌పాల్, రైతులు, కంపెనీ ప్రతినిధులు, బ్యాంకర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

ప్రజాశక్తి - సాలూరు

జమ్మూ కాశ్మీర్లో ప్రస్తుతం ఉన్న పరిస్థితుల నుంచి ఆప్రాంత ప్రజలను కాపాడుకోవడానికి కేంద్రం వెంటనే చర్యలు చేపట్టాలని, ఉగ్రవాదులను ఏరివేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్వై నాయుడు కోరారు. జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదుల దాడుల్లో అమరులైన మృతులకు శుక్రవారం కొవ్వొత్తులు వెలిగించి నివాళ్లు అలర్పించారు. స్థానిక రైల్వే స్టేషన్ రోడ్డు కాలనీలో జరిగిన కార్యక్రమంలో నాయుడు మాట్లాడారు. పర్యాటక ప్రాంతమైన జమ్మూ కాశ్మీర్లో ఇలాంటి ఘటనలు జరగడం వల్ల ఈ వృత్తిపై ఆధారపడి జీవిస్తున్న వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని, ప్రదేశాల్లో ఇలాంటి ఘటన వల్ల పర్యాటకులకు ఇబ్బందులు కలడమే కాకుండా ఈ రంగంపై ఆధారపడ్డ వారి కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి ఉందని తెలిపారు. ఉగ్రవాదుల ఏరివేతలో కేంద్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించకుండా కఠినంగా వ్యవహరించాలని కోరారు. బాధిత కుటుంబాలకు ధైర్యం కల్పించి ఉపాధి కల్పించాలని, కాశ్మీర్లో ఉపాధి కోల్పోయిన పర్యాటక కార్మికులందర్నీ ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో కాలనీ సంఘం నాయకులు ఈశ్వరమ్మ, తనోజు, ఈశ్వరి, అరుణ, రమణ, చిన్నమ్మలు, పార్వతమ్మ, సరోజిని పాల్గొన్నారు.

సీతానగరం : స్థానిక హనుమాన్ జంక్షన్ నుంచి బజార్ వరకు సిఐటియు ఆధ్వర్యంలో కాశ్మీర్ టూరిస్టులపై ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదాన్ని భారత ప్రజానీకమంతా ఖండించాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి గవర వెంకటరమణ, అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి జ్యోతిలక్ష్మి, సిఐటియు మండల కమిటీ సభ్యులు ఆర్.రాము, అంగన్వాడీ కార్యకర్తలు, భవనిర్మాణ కార్మికులు పాల్గొన్నారు.

సిపిఎం ఆధ్వర్యాన కొవ్వొత్తుల ర్యాలీలు

బలిజిపేట : కాశ్మీర్‌లో ఉగ్రవాదులు జరిపిన కాల్పులను నిరసిస్తూ, ఉగ్రవాదాన్ని నిర్మూలించాలని కోరుతూ సిఐటియు ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ వద్ద శుక్రవారం తెలిపారు. అనంతరం ఉగ్రవాదుల దాడుల్లో మరణించిన వారికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, జిల్లా కమిటీ సభ్యులు జ్యోతి, దాలమ్మ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ఉగ్రవాద నిర్మూలనకు చర్యలు చేపట్టడంలో విఫలమైందని విమర్శించారు. శాశ్వత ఉద్యోగాల స్థానంలో అగ్నిపథ్ పద్ధతిలో ఉద్యోగాలను నియమించడంతో సైన్యంలో నిబద్దత కొరవడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఉగ్రవాద నిర్మూలనకు, దేశ భద్రతకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు ప్రజాసంఘాల నాయకులు సావిత్రి, లక్ష్మి, అనురాధ, ప్రమీల, దేవి శారద తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో...

జమ్మూ కాశ్మీర్లో జరిగిన ఉగ్ర దాడిని ఖండిస్తూ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో సీతానగరం బజార్ నుంచి హనుమాన్ జంక్షన్ వద్ద వరకు కొవ్వొత్తిల ర్యాలీ. నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు మమ్మల విశ్వేశ్వరరావు, ఆరిశెట్టి సత్యనారాయణ, గోవింద్, శ్రీను, బుడితి శ్రీను, ఉమామహేశ్వర తదితరులు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో...

కురుపాం : జమ్మూకాశ్మీర్ పహల్గాంలో పర్యాటకులపై ఉగ్రవాదులు జరిపిన దాడులను ఖండిస్తూ మరణించిన వారి ఆత్మ లకు శాంతి చేకూరాలని కురుపాంలోని రావాడ జంక్షన్ నుండి బస్టాండ్ వరకు జనసేన నియోజకవర్గ ఇన్చార్జి కడ్రక మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో జనసేన, టిడిపి నాయకులు కొవ్వొత్తులతో శాంతియుత ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, కూటమి నాయకులు పాల్గొన్నారు.

పార్వతీపురం టౌన్ : పహాల్గామాలో ఉగ్రవాదులు జరిపిన దాడులను ఖండిస్తూ చనిపోయిన వారి ఆత్మకు శాంతి కలగాలని కోరుకుంటూ మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు ఆధ్వర్యాన వైసిపి శ్రేణులు పట్టణ ప్రధాన రహదారి, వైఎస్ఆర్ విగ్రహం వద్ద కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు . ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉగ్రవాదులు ఎన్ని పన్నాగాలు పన్నని దేశంలోని ప్రజలు ఐకమత్యంతో ఆయన అన్నారు. కార్యక్రమంలో పలువురు వైసిపి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాలూరులో కొవ్వొత్తులో ర్యాలీ చేస్తున్న సిపిఎం నాయకులు

సీతానగరంలో శాంతి ర్యాలీ నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

పార్వతీపురంలో కొవ్వొత్తుల ర్యాలీ చేస్తున్న వైసిపి నాయకులు

ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

అవగాహనతోనే మలేరియా అంతం

ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ, సదస్సు

ప్రజాశక్తి -పార్వతీపురం

అవగాహనతోనే మలేరియాను నివారించవచ్చునని, ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీని శుక్రవారం స్థానిక వైద్య, ఆరోగ్యశాఖ కార్యాలయం నుంచి ఆయన జెండా ఊపి ప్రారంభించారు. మలేరియా నివారణ నినాదాలతో ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బంది ర్యాలీ కొనసాగించారు. అనంతరం ఎన్‌జిఒ హోం సమావేశ భవనంలో అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ భాస్కరరావు మాట్లాడుతూ మలేరియా వ్యాధి, నివారణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని, తద్వారా నిర్మూలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మన పరిసరాల్లో నీరు నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమల లార్వా పెరుగుతుందని, నీటి నిల్వల్లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఫ్రైడే-డ్రైడేను ప్రతి ఒక్కరూ పాటించాలని కోరారు. జిల్లాలో మలేరియా ప్రభావిత గిరిజన ప్రాంతాలు ఎక్కువగా ఉన్నాయని, దోమల నివారణా చర్యల్లో భాగంగా 915 గ్రామాల్లో మే 1నుంచి ఐఆర్ఎస్ స్ప్రేయింగ్ ఇంటింటికీ చేయిస్తామని తెలిపారు. అలాగే జూలై 1 నుంచి రెండో విడత పిచికారీ చేయిస్తామని తెలిపారు. ఎఎల్ఒ పిచికారీ, ఫోకల్ స్ప్రేయింగ్, ఫాగింగ్‌లను మలేరియా గుర్తించిన ప్రాంతాల్లో చేయిస్తామని పేర్కొన్నారు. వెక్టార్ కంట్రోల్ హైజీన్ యాప్ ద్వారా దోమల పెరుగుదల ప్రదేశాలను వైద్య సిబ్బంది గుర్తించి వివరాలు నమోదు చేసి పంచాయతీ, వార్డు సెక్రటరీలు, సిబ్బంది ద్వారా ఎప్పటికప్పుడు నివారణా చర్యలు చేపట్టాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని అన్ని ఆరోగ్య కేంద్రాల పరిధిలో నిర్వహిస్తున్నామన్నారు. వివిధ శాఖల సమన్వయంతో ప్రజల్లో అవగాహన పెంపొందించి మలేరియా నివారణకు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం అధికారులు డాక్టర్ టి. జగన్‌మోహనరావు, పిఎల్ రఘుకుమార్, ఎఎంఒ డి.సూర్యనారాయణ, వైద్యాధికారి డా.రవిచంద్ర, క్వాలిటీ కన్సల్టెంట్లు డాక్టర్ రమణ, డాక్టర్ మణికంఠ, ఎన్‌జిఒ అధ్యక్షులు జివిఆర్ఎస్. కిషోర్, డెమో సన్యాసిరావు, సబ్ యూనిట్ అధికారి ధనుంజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

28న చైర్మన్ ఎన్నిక

కూటమి ఖాతాలో చేర్చేందుకు ప్రయత్నాలు
భూదేవి గ్రూపు వ్యక్తికే పగ్గాలు?

ప్రజాశక్తి - పాలకొండ

స్థానిక నగర పంచాయతీ చైర్మన్ ఎన్నిక ఈనెల 28న జరగనుంది. ఎస్సీ రిజర్వుడ్‌కు కేటాయించిన చైర్మన్ కుర్చీ ఇప్పటికే రెండుసార్లు కోరం లేక వాయిదా పడింది. 20 వార్డులు ఉండగా, రెండు ఎస్సీలకు కేటాయించగా, అందులో 19వ వార్డుకు చెందిన యందవ రాధా కుమారి వ్యక్తిగత కారణాలతో చైర్మన్ పదవికి గతేడాది డిసెంబర్లో రాజీనామా చేశారు. అప్పటి నుంచి వైస్ చైర్మన్-2 పల్లా ప్రతాప్ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. అయితే రెండో వార్డుకు చెందిన ఆకుల మల్లేశ్వరికి ఈ పదవి వరించాల్సిందే. అయితే గతంలో చైర్మన్ ఎన్నికకు ముందు వైసిపి వదిలి టిడిపి జెండా కప్పుకోవడంతో వైసిపి కౌన్సిలర్లలో సంఖ్యా బలం ఉండడంతో రెండుసార్లు ఎన్నికను వ్యతిరేకించారు. సమావేశానికి హాజరు కాకపోవడంతో వాయిదా పడింది. అయితే ఈసారి వచ్చిన వారితోనే ఎన్నిక జరిపి ముగ్గురు ఉంటే చైర్మన్‌గా ప్రకటించవచ్చని నోటిఫికేషన్ రావడంతో మల్లేశ్వరికి అనుకూల వాతావరణం కనిపిస్తుంది. అయితే ఇప్పటికే టిడిపిలో రెండు గ్రూపులు బహిరంగంగానే కుమ్ములాడుకుంటున్నాయి. ఎమ్మెల్యే జయకృష్ణ గ్రూపీయులు తామే అసలైన టిడిపికి చెందిన వారమని, నియోజకవర్గ టిడిపి ఇన్చార్జి భూదేవి గ్రూపీయులు గత ఎన్నికల్లో వైసిపికి అనుకూలంగా పని చేశారని ఆరోపిస్తుండగా, భూదేవి గ్రూపీయులు తాము పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్నామని, అయినా ఎమ్మెల్యే వర్గం తమను అస్సలు పట్టించుకోవటం లేదని ఆరోపిస్తున్నారు. ఈ పరిస్థితుల్లో మల్లేశ్వరి భూదేవి వర్గానికి చెందిన వ్యక్తిగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతుంది. మల్లేశ్వరి భర్త కుమార్ అనుచరులు మాత్రం టిడిపి ఇన్‌ఛార్జిగా ఉండడంవల్ల కలిసి పని చేస్తున్నామని, అదేవిధంగా ఇక్కడున్న కూటమి ఎమ్మెల్యేని కూడా గౌరవిస్తూనే ఉన్నామని చెప్తున్నారు. ఏదిఏమైనా ఈగ్రూపు రాజకీయాలు ఈనెల 29న జరగనున్న చైర్మన్ ఎన్నికకు విధంగా ఫలితాలిస్తాయో వేచిచూడాల్సిందే.

సచివాలయంలో కొనసాగుతున్న సేవలు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక పెద్ద భోగిలి, బుడ్డిడిపేటలో గల సచివాలయాల్లో గల ప్రజలకు వివిధ రకాల సేవలు శుక్రవారం నుంచి అందుబాటులోకి వచ్చాయి. 'ప్రజాశక్తి'లో శుక్రవారం ప్రచురితమైన సచివాలయాల్లో పౌర సేవలు శూన్యం అన్న వార్తకు అధికారులు స్పందించారు. ఈ మేరకు ఈ సచివాలయాల్లో కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాల జారీని ఇన్చార్జిలకు అప్పగిస్తే, వారు వెంటనే లబ్ధిదారులకు అందజేశారు.

సదస్సులో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి మన్మథరావు

సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి : సిఐటియు

ప్రజాశక్తి - బలిజిపేట

కార్మికులకు నష్టం చేసే లేబర్ కోడ్లను రద్దు చేయాలని, కార్మిక చట్టాలను పగడ్బందీగా అమలు చేయాలని, మేడే, మే 20న దేశ వ్యాప్తంగా జరుగు జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు పిలుపునిచ్చింది. ఈ మేరకు శుక్రవారం బలిజిపేటలో సిఐటియు ఆధ్వర్యంలో కె.దాలమ్మ అధ్యక్షతన సదస్సు జరిగింది. ఈ సదస్సులో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి యమ్మల మన్మధరావు, ప్రజా సంఘాల నాయకులు జ్యోతిలక్ష్మి మాట్లాడుతూ దేశంలో కార్మిక వర్గానికి నష్టం చేసే లేబర్ కోడ్ రద్దు చేయాలని, కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం పారిశ్రామిక అధిపతులు, దోపిడీ వర్గాలకు కొమ్ము కాయడం కోసం కార్మికుల శ్రమను దోచి పెట్టాలని చూస్తుందని విమర్శించారు. ఇందుకోసం పని గంటలు పెంచడం, సంఘాల ప్రాధాన్యతను తగ్గించి యాజమాన్యాలకు హక్కులు సులభతరం చేయడం అంటే కార్మికులను మోసగించడమేనన్నారు. ఇలాంటి నిర్ణయాలకు వ్యతిరేకంగా, కార్మిక చట్టాలను, హక్కులను, ఇఎస్ఐ, ఇన్సూరెన్స్, ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, కార్మిక వ్యతిరేక విధానాలు లేబర్ కోడ్ రద్దు చేసి కార్మికులకు కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మే 20న జరుగు సమ్మెను, జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి వాడలో మేడే జెండా ఎగురవేసి ర్యాలీలు, సభలు జయప్రదం చేయాలని కోరారు. రాబోయే రోజుల్లో సిఐటియు, ఇతర సంఘాలను కలుపుకొని పోరాటాలకు సిద్ధపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో కార్మికులు, స్కీమ్ వర్కర్లు, అసంఘటిత కార్మికులు పాల్గొన్నారు.

నేడు గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులతో సమావేశం

ప్రజాశక్తి -గుమ్మలక్ష్మీపురం

రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్సీపై శనివారం పార్వతీపురంలో గిరిజన ఉపాధ్యాయ అభ్యర్థులతో సమావేశం ఏర్పాటు చేసినట్లు గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తాడంగి సాయి బాబు, పాలక రంజిత్ కుమార్ తెలిపారు. మన్యం జిల్లాలో గల అభ్యర్థులు శనివారం ఉదయం 10 గంటలకు పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ ఆఫీస్‌కు రావాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఐసిడిఎస్ పీడీ కనకదుర్గ

విజన్ స్వర్ణాంధ్ర యాక్షన్ ప్లాన్‌పై సమావేశం

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం నియోజకవర్గ విజన్ (స్వర్ణాంధ్రప్రదేశ్2047) యాక్షన్ ప్లాన్‌పై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద శుక్రవారం ఎంపిడిఒ జె.ఉమామహేశ్వరి ఆధ్వర్యంలో విజన్ యాక్షన్ ప్లాన్ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి ఐసిడిఎస్ పీడీ యాక్షన్ ప్లాన్ కోఆర్డినేటర్ పి.కనకదుర్గ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె సభ్యులకు యాక్షన్ ప్లాన్ తయారు చేయడానికి తీసుకోవాల్సిన విధులు, బాధ్యతలు గూర్చి అవగాహన కల్పించి పక్కగా ప్రణాళికలు తయారు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో మండల అధికారులు యాక్షన్ ప్లాన్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహం

ప్రజాశక్తి పార్వతీపురంరూరల్

ప్రభుత్వ పాఠశాలలో చదివిన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ఐదుగురు విద్యార్థులకు ఎమ్మెల్యే బి.విజయ్ చంద్ర ప్రతిభ ప్రోత్సాహం అందించారు. శుక్రవారం స్థానిక టిడిపి కార్యాలయంలో నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు రూ.5వేలు చొప్పున అందజేశారు. రాష్ట్రంలో పదో తరగతి ఫలితాల్లో జిల్లా ప్రథమ స్థానం సాధించడం ఆనందంగా ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివి మంచి మార్కులు సాధించి పది మందికి ఆదర్శంగా నిలిచిన విద్యార్థులను అభినందించారు. ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను, ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకొని మరింత ఉన్నత చదువులు అభ్యసించాలని ఎమ్మెల్యే ఈ సందర్భంగా కోరారు. విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఎల్ఆర్ఎం వాలంటీర్లతో ఎంపిడిఒ కృష్ణారావు

స్వచ్ఛ సుందర సీతంపేట కోసం కృషి

ప్రజాశక్తి - సీతంపేట

స్వచ్ఛ సుందర పార్వతీపురం మన్యం జిల్లా కార్యక్రమంలో భాగంగా సీతంపేటలో సాలిడ్, లిక్విడ్ రిసోర్స్ మేనేజ్మెంట్ (ఎస్ఎల్ఆర్ఎం) వాలంటీర్లతో ఎంపిడిఒ టి.కృష్ణారావు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భవిష్యత్తులో ప్లాస్టిక్ రహిత జీవన విధానాన్ని అలవర్చడం కోసం, రీసైకిలింగ్‌కు అనువుగా ఉండేలా తడి, పొడి చెత్తను వేరు చేసి అందించేలా సమాజంలో అవగాహన కల్పించాలని కోరారు. శనివారం నుంచి ప్రారంభమయ్యే సర్వేలో వీటికి సంబంధించిన సమాచారం ఇంటింటి సర్వే ద్వారా ఎస్ఎల్ఆర్ఎం వాలంటీర్లు తీసుకోవాలని చెప్పారు. దీనికి మండల యంత్రాంగంలో ఉన్న ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకొని పనిచేయాలని తెలిపారు. కార్యక్రమంలో కో-ఆర్డినేటర్ ఎం. నరేష్, టీం లీడర్ ఎన్. గణేష్, పంచాయతీ కార్యదర్శి బి.రామకృష్ణ, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

భద్రగిరి ఆస్పత్రి నిర్మాణ పనులు పరిశీలన

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని భద్రగిరి సామాజిక ఆరోగ్య కేంద్రం అదనపు భవన నిర్మాణ పనులను ప్రభుత్వ విప్, కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అక్కడ జరుగుతున్న పనులను పరిశీలించి ఎప్పటిలోగా పూర్తి చేస్తారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ ఆసుపత్రి అందుబాటులోకి వస్తే వందలాది గిరిజనులకు అన్ని రకాల వైద్య సేవలు మెరుగుపడతాయన్నారు. నిర్మాణంలో ఉన్న 50 పడకల ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేసేందుకు సంబంధిత గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణి నాబార్డ్ అధికారులకు ప్రతిపాదనలు పెట్టామన్నారని తెలిపారు.

అధ్యాపకులకు శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

2025 - 26 సంవత్సరానికి గానూ ఇంటర్ విద్యలో అమలు కాబోయే కొత్త సిలబస్, ప్రశ్నల నమూనాపై జిల్లాలో గల జూనియర్ లెక్చరర్లకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 12 రోజుల పాటు ఆన్లైన్ ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిఐఇఒ మంజులవాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 24న ప్రారంభమైన ఈ శిక్షణా తరగతుల్లో ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం సైన్స్ హ్యూమానిటీస్ లాంగ్వేజ్‌లో 14 విభాగాల సిలబస్ పాఠ్య పుస్తకాల పున: సమీక్షపై లెక్చరర్లకు అవగాహన కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ శిక్షణా కార్యక్రమం కోసం స్థానిక జూనియర్ కళాశాలలో ప్రత్యేకంగా నాలుగు గదులను కేటాయించామని, అందుకు తగిన సాంకేతిక వ్యవస్థ ఏర్పాటు చేసి ఆన్లైన్లో శిక్షణ ఇస్తున్నట్టు తెలిపారు.

వైసిపి పట్టణ అధ్యక్షులుగా వెలమల

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ పట్టణ వైసిపి అధ్యక్షులుగా వెలమల మన్మధరావు, మండల పార్టీ అధ్యక్షులుగా కనపాక సూర్య ప్రకాష్ నియమితులయ్యారు. వరుసగా మూడోసారి నియమితులైన మన్మధరావును ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్, మాజీ ఎమ్మెల్యే కళావతి అభినందించారు. ఈ సందర్భంగా మన్మధరావు మాట్లాడుతూ తనపై నమ్మకంతో మళ్లీ అధ్యక్షునిగా పదవిని కట్టబెట్టిన పార్టీ అధినేత జగన్మోహన్‌రెడ్డికి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్‌కు, మాజీఎమ్మెల్యే వి.కళావతికి కృతజ్ఞతలు తెలిపారు. శక్తివంచన లేకుండా అందర్నీ కలుపుకొని పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని వెల్లడించారు. అనంతరం వెలమల మన్మధరావును పార్టీ పెద్దలు, కౌన్సిలర్లు అభినందనలు తెలిపారు.

వైసిపి ఆర్‌టిఐ జిల్లా అధ్యక్షులుగా సింగారపు

సాలూరురూరల్ : పట్టణానికి చెందిన రెండో వార్డు కౌన్సిలర్ సింగారపు ఈశ్వరరావును వైసిపి ఆర్‌టిఐ అధ్యక్షులుగా నియమితులయ్యారు. అధ్యక్షునిగా ఎన్నికైన ఈశ్వరరావును మాజీ ఉప ముఖ్యమంత్రి పీడిక రాజన్నదొర, మున్సిపల్ చైర్‌పర్సన్ పువ్వల ఈశ్వరమ్మ, పట్టణ వైసిపి అధ్యక్షులు వంగపండు అప్పలనాయుడు, గిరి రఘు, దండి శ్రీనివాసరావు, నియోజకవర్గ నాయకులు అభినందించారు.

నాటు సారా తయారు చేస్తే జైలుకే

ప్రజాశక్తి - సీతంపేట

నాటుసారా తయారు చేస్తే జైలుకు పంపిస్తామని స్థానిక తహశీల్దార్ అప్పలరాజు, ఎక్సైజ్ ప్రొబిషన్ ఇన్స్పెక్టర్ సూర్యకుమారి హెచ్చరించారు. శుక్రవారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో నాటు సారా పాత ముద్దాయిలు 53 మందిని తహశీల్దార్ అప్పలరాజు బైండోవర్ కేసులు నమోదు చేసి రూ.రెండు లక్షలు పూచీకత్తుతో విడుదల చేశామని తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సారాయి తయారు చేసినా, అమ్మినా కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని హెచ్చరించారు. నల్లబెల్లం సరఫరా చేసిన వారిని జైలుకు పంపుతామని అన్నారు.

మలేరియా నిర్మూలనకు కృషి చేయాలి

డిప్యూటీ డిఎంహెచ్‌ఒలు విజయపార్వతి, పద్మావతి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మలేరియా నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మన్యం జిల్లా డిప్యూటీ డిఎం హెచ్‌ఒ పద్మావతి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా మండలంలోని తాడికొండలో అవగాహన ర్యాలీ శుక్రవారం నిర్వహించారు. ఈ ఏడాది నుంచి మలేరియా అంతం మనతోనే అన్న నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లి మలేరియా అంతానికి మనమంతా పాటుపడాలని అన్నారు. మలేరియా నిర్మూలనకు ఆడ అన్నాఫ్లిస్ దోమలు, మరి ఏ ఇతర దోమలు లేకుండా గ్రామాల్లో పారిశుధ్య కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇచ్చి పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి ఇంటి వద్ద 5 శాతం ఎసిఎం పిచికారీ జరగాలని, దోమతెరలు వాడకం చేయాలని, వీధుల్లో నీటి నిల్వలు లేకుండా ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. అనంతరం పిహెచ్‌సికి వెళ్లి రోగులకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. రోజువారీ ఓపి నమోదును అడిగి తెలుసుకున్నారు. ఎఎన్ఎం రికార్డుల్లో ఎఎన్‌సి, పిఎన్‌సి, ఇమ్యునైజేషన్ రికార్డులను పరిశీలించారు. గ్రామాల్లో రోజువారీ విధులకు వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు ఎం.బుద్దేశ్వరరావు, పైలా అభిలాష్, సిహెచ్‌ఒ పద్మావతి, హెల్త్ సూపర్వైజర్లు శ్రీను, ఎర్రాయమ్మ , వైద్య సిబ్బంది రత్న ప్రసాద్, లక్ష్మణరావు తదితరులు ఉన్నారు.

సీతంపేట : అందరిలోనూ మార్పు వస్తేనే మలేరియా అంతం జరుగుతుందని డిప్యూటీ డిఎంహెచ్‌ఒ కె.విజయపార్వతి పిలుపునిచ్చారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ఏరియా ఆసుపత్రి నుండి ర్యాలీ నిర్వహించారు. మలేరియా నిర్మూలనకు అందరూ సహకరించాలని కోరారు. మలేరియా మహమ్మారిని తరిమికొట్టాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ టి.కృష్ణారావు, ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ బి.శ్రీనివాసరావు, దోనుబాయి వైద్యాధికారి భాను ప్రతాప్, ఎఎన్‌ఒ శ్రీనివాసరావు, సబ్ యూనిట్ అధికారి జె.మోహనరావు, ఎంటిఎస్ ఝాన్సీ రాణి తదితరులు పాల్గొన్నారు.

వీరఘట్టం : స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మలేరియా అంతం మన పంతం, చిన్న ప్రాణులు పెను ప్రమాదం, దోమకాటు పెనుముప్పు, దోమ పుట్ట

సీతంపేటలో ర్యాలీ ప్రారంభిస్తున్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ విజయపార్వతి

ర్యాలీలో పాల్గొన్న డిప్యూటీ డిఎంహెచ్‌ఒ పద్మావతి

రాదు దోమ కుట్టరాదు, దోమలను నిర్మూలిద్దాం దోమల ద్వారా వచ్చే వ్యాధులను నివారిద్దాం, నెట్ కట్టు దోమ ఫట్, ఇంటి చుట్టు మురుగునీరు అంటూ వ్యాధులతో ఎందుకు పోరు, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచండి దోమల వ్యాప్తిని అరికట్టండి ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు జనార్ధన్ రావు, శాంతి కుమారి, ఆదిలక్ష్మి, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, హెల్త్ సహాయకులు, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

కురుపాం : మండల కేంద్రంలోని రావాడ రామభద్రపురం పిహెచ్‌సి వైద్యాధికారి శంకరరావు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది మలేరియా నివారణపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రజలు మలేరియా వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

బలిజిపేట : స్థానిక పిహెచ్‌సి పరిధిలో గల బలిజిపేట, పెదపెంకి, చిలకలపల్లి తదితర గ్రామాల్లో ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా మలేరియా అవగాహనా ర్యాలీలు వైద్యాధికారి క్రాంతి కిరణ్మయి ఆధ్వర్యంలో జరిగింది. ఈ ర్యాలీలో మలేరియా నివారణకు వైద్యాధికారి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో సిహెచ్‌ఒ సత్యనారాయణ, హెచ్ నాని, హెల్త్ అసిస్టెంట్ ఉమామహేశ్వరరావు ఎఎన్ఎం లక్ష్మి, ఆశాలు పాల్గొన్నారు.

పాలకొండ : ప్రపంచ మలేరియా దినోత్సవ సందర్భంగా పాలకొండ నగర పరిధిలో స్థానిక అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ వరకూ అర్బన్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కొక్కిరపాటి తేజ్ రతన్ రాజ్ ఆధ్వర్యాన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సబ్ యూనిట్ ఆఫీసర్ మొజ్జాడ మోహనరావు, హెచ్‌వి రమణమ్మ, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, ఆస్పత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భామిని : మండలంలోని బాలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ జి.శివకుమార్ ఆధ్వర్యంలో ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించి, అన్ని హెల్త్ సబ్ సెంటర్లో దోమల వల్ల కలిగే వ్యాధుల పట్ల అవగాహన, దోమల నివారణా చర్యలు, దోమ తెరల వినియోగం మొదలైన వాటి గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానికంగా గల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ప్రజాదర్బార్ నిర్వహించారు. మండలంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వచ్చి తమ సమస్యలను ఎమ్మెల్యే జగదీశ్వరికి అందజేశారు. నియోజకవర్గంలోని ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువెళ్లి దశల వారీగా పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, ఎంపిటిసిసభ్యులు కె.మల్లేశ్వరరావు ఉన్నారు.

సిఎం సహాయ నిధి అందజేత

గరుగుబిల్లి మండలం తోటపల్లి గ్రామానికి చెందిన మార్కొండ దేవికి సీఎం సహాయ నిధి నుంచి రూ.40,960 చెక్కును ఎమ్మెల్యే జగదీశ్వరి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి సింహాచలం ఉన్నారు.

నేత్ర చికిత్సకు వృద్ధుల తరలింపు

ప్రజాశక్తి - కురుపాం

కురుపాం, గుమ్మలక్ష్మీపురం మండలాల సచివాలయ పరిధిలో గల గ్రామాల్లో ఇటీవల నిర్వహించిన నేత్ర వైద్య శిబిరాల్లో కేటరాక్ట్ (అంతర కుసుమం), టేరిజియం(కొయ్యకండ) లోపం ఉన్న వారిని గుర్తించి శుక్రవారం స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం నుండి పుష్పగిరి కంటి ఆసుపత్రికి శస్త్ర చికిత్సల కోసం తరలించినట్లు నేత్ర వైద్యాధికారి జీరు నగేష్‌రెడ్డి తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ శస్త్ర చికిత్సలకు వెళ్లిన వారందరికీ ఉచిత రవాణా, వసతి, భోజనం, కళ్ళ జోళ్లు, మందుల సౌకర్యాలు కల్పిస్తామని, చికిత్సలు జరిగిన అనంతరం తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి అవగాహన కల్పించామని అన్నారు. కార్యక్రమంలో ఆరోగ్యమిత్ర సురేష్, ఐసిటిసి కౌన్సిలర్ మోహనరావు, ఎస్ సొసైటీ కార్యదర్శి షేక్ గౌస్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆధిపత్యం కోసం ఆరాటం

రోడ్డున పడ్డ టిడిపి గ్రూపు రాజకీయాలు

ప్రజాశక్తి - పాలకొండ

కొంతకాలంగా నియోజకవర్గ తెలుగుదేశం పార్టీలో గ్రూపుల పోరు కొనసాగుతోంది. ఇద్దరు పెద్ద నాయకుల మధ్య ఉన్న ఆధిపత్యం పోరు కాస్త కింద స్థాయికి పాకుతుంది. దీంతో తెలుగు తమ్ముళ్లు ఇరుగ్రూపుల మధ్య నలిగిపోతున్నారు. ఎంతో కాలం నుంచి ఇదే పరిస్థితి కొనసాగుతుంది. ఒకరు పక్క నియోజకవర్గంలో ఉన్న బలమైన సామాజిక వర్గానికి చెందిన కీలక నేత కాగా, మరొకరు శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాలోని చక్రం తిప్పిన నేత. మొదటి నుంచి పాలకొండ నియోజకవర్గంలో ఈ నేతల మధ్య అంతర్గత పోరు కొనసాగుతున్నది బహిరంగంగా తెలిసిన విషయమే. అయితే ఇటీవల జనసేనకు పాలకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే టికెట్ కేటాయించడంతో టిడిపి నుంచి వచ్చిన ఆయన జనసేన తరపున గెలవడం రాజకీయ సమీకరణలు పూర్తిగా మారిపోయాయి. అప్పటి వరకు టిడిపి తరఫున టికెట్ ఆశించిన భూదేవికి జనసేనకు టికెట్ కేటాయించడంతో టిడిపి ఆమెకు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పగ్గాలు అప్పగించింది. అయినప్పటికీ ఎమ్మెల్యేతో ఉన్న టిడిపి గ్రూపు ఇన్చార్జి భూదేవి గ్రూపునకు మధ్య సయోధ్యకుదరలేదు. ఎన్నికల్లో కూటమి ఎమ్మెల్యే జయకృష్ణకు వ్యతిరేకంగా పనిచేశారని సమావేశాల్లోని బహిరంగంగానే ఎమ్మెల్యే గ్రూపీయులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధిష్టానం దృష్టికి కూడా తీసుకువెళ్లినట్లు తెలుస్తుంది. అదేవిధంగా భూదేవి కూడా తనుకు ఇన్చార్జిగా ఎమ్మెల్యే గ్రూపీయులు గుర్తింపు ఇవ్వడం

నాయకత్వాన్ని నిలదీస్తున్న కార్యకర్తలు (ఫైల్)

లేదని, తనను నిర్లక్ష్యం చేస్తున్నారని ఫిర్యాదు చేసినట్లు సమాచారం. అయితే భూదేవికి జిల్లా ఇన్చార్జి మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆశీస్సులు ఉన్నట్లు బహిరంగనే పార్టీలో చర్చ జరుగుతుంది. ఎమ్మెల్యేకి చెందిన టిడిపి వర్గాలకు చీపురుపల్లి ఎమ్మెల్యే, సీనియర్ నేత కిమిడి కళా వెంకట్రావు అండదండలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో గుసగుసలు వినిపిస్తున్నాయి. అయితే నియోజకవర్గంలో ఇద్దరు సీనియర్ నేతలు పెత్తనం కోసమా లేక ఆధిపత్యం కోసమా ఈ గ్రూపుల పోరు జరుగుతుందన్నది పలువురు చర్చించుకుంటున్నారు. ఇటీవల శనివారం జరిగిన పరిశీలకుల ముందు ఇన్చార్జిగా భూదేవిని తొలగించాలని టిడిపి నాయకులు ఏకరువు పెట్టడంతో తెలుగుదేశం పార్టీలో ఏం జరుగుతుందనేది అందరూ ఎదురుచూసే పరిస్థితి కనిపిస్తుంది.

కార్పొరేషన్ రుణాలు సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

అర్హులైన వారందరికీ రుణాలు అందజేస్తామని, ఎస్సీ కార్పొరేషన్ ద్వారా మంజూరైన రుణాలను సద్వినియోగం చేసుకొని, మహిళలు ఆర్థికంగా ఎదగాలని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర అన్నారు. ఎస్సీ కార్పొరేషన్, పిఎం ఎజెవై రుణాల మంజూరు కోసం దరఖాస్తు చేసిన ఆరుగురు లబ్ధిదారులకు మంజూరైన రుణాల చెక్కులను ఎమ్మెల్యే శుక్రవారం నర్సిపురంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 23 మంది లబ్ధిదారులకు ఈ రుణాలు మంజూరయ్యాయని, అందులో పార్వతీపురం నియోజకవర్గానికి చెందిన 8 మంది లబ్ధిదారులకు రుణాలు వచ్చాయని అన్నారు. ఈ ఎనిమిది మందిలో ఆరుగురు నర్సిపురం గ్రామస్తులు కావడం అభినందనీయమన్నారు. మన గ్రామం రాష్ట్రంలోనే ఆదర్శ గ్రామంగా నిలవాలని, ఆ దిశగా మీరంతా కష్టపడి పంటలు పండించి ఎగుమతులు చేయాలని కోరారు. మహిళలు ఆర్థికంగా బలంగా ఉంటే మీ సొంత నిర్ణయాలు మీరు తీసుకోవచ్చని, తద్వారా తమ పిల్లలను బాగా చదివించవచ్చన్నారు. ప్రభుత్వం ప్రకటించిన కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకున్న వారందరికీ ప్రభుత్వం న్యాయం చేస్తుందని, ఎవరూ నిరాశ చెందొద్దని అన్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఎ పీడీ సుధారాణి, టిడిపి నాయకులు గొట్టాపు వెంకటనాయుడు, బోను చంద్రమౌళి, టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

సంత నర్సిపురంలో వైద్య శిబిరం

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని సంత నర్సిపురంలో శుక్రవారం స్థానిక వైద్యాధికారి బి.ప్రదీప్ కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలింతలు, గర్భిణీలు, జ్వర పీడితులు, రక్తపోటు, మధుమేహ, తదితర రకాలైన రోగులకు ప్రత్యేక వైద్య తనిఖీలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎం ఎల్‌హెచ్‌పి, ఎఎన్ఎం, ఆశా కార్యకర్తలు, 104 సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

హౌసింగ్ కార్పొరేషన్ ద్వారా ఇళ్లు నిర్మిస్తున్న పేదలకు ప్రభుత్వం అందిస్తున్న అదనపు నగదు ప్రోత్సాహంతో నిర్మాణాలను పూర్తి చేయాలని మండల ప్రత్యేక అధికారి డిఆర్‌డిఎ ప్రాజెక్టు డైరెక్టర్ సుధారాణి అన్నారు. శుక్రవారం ఆమె మండలంలోని కృష్ణపల్లిలో మన ఇల్లు మన గౌరవం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుని ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకోవాలని అన్నారు. అంతేకాకుండా స్థలం కలిగిన ప్రతి పేద వారికి రూ.4లక్షలు ఇంటి నిర్మాణం నిమిత్తం ప్రభుత్వం అందజేస్తుందని, వాటితో ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసి సొంత గృహదారులై ఆత్మ గౌరవం నిలుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఇన్చార్జి ఎంపిడిఒ జి.రమణమూర్తి, హౌసింగ్ ఎఇ

సీతానగరంలో అధికారులతో మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి రాజేశ్వరి

చిరంజీవి, గ్రామ కార్యదర్శి మధు పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం : ఇళ్ల నిర్మాణ పనులు తక్షణమే చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి పి.రాజేశ్వరి అన్నారు. మండలంలోని గడ్డలుప్పి సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన అనంతరం సిబ్బందితో మాట్లాడారు. లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణ పనులు చేపట్టి చేపట్టాలని, ప్రభుత్వం వాటికి వెంటనే బిల్లులు మంజూరు చేస్తుందని తెలిపారు. ప్రతి సమస్య పరిష్కరించే దిశగా సచివాలయ సిబ్బంది పనిచేయాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ జె.ప్రసన్నకుమార్, ఎంపిడిఒ పి.త్రివిక్రమరావు, సిహెచ్ జానకీరాం, శ్రీనివాసరావుతో పాటు పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు

పాముకాటుతో వ్యక్తి మృతి

నెల్లిమర్ల: మండలంలోని కొత్తపేటకు చెందిన అట్టాడ పూడినాయుడు (38) గురువారం రాత్రి పాము కాటు వేయడంతో మృతి చెందాడు. ఇంటి డాబాపై నిద్రపోయేందుకు వెళ్తున్న అతడు మెట్లపై ఉన్న పామును చూడకుండా తొక్కేశాడు. దీంతో పాము అతడికి కాటు వేసింది. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో పూడినాయుడు శుక్రవారం మృతి చెందాడు.

పేదలకు దుప్పట్లు, దోమతెరలను అందజేస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం

పేదలకు దుప్పట్లు, దోమతెరలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

జిల్లాలో రెడ్ క్రాస్ సేవలు అభినందనీయమని కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. రెడ్‌క్రాస్ సొసైటీ అధ్యక్షులు డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు ఆధ్వర్యంలో తన క్యాంపు కార్యాలయంలో 40మంది నిరుపేదలకు దుప్పట్లు, దోమతెరలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో సామాజిక సేవా కార్యక్రమాలు జరగడం సంతోషంగా ఉందన్నారు. ప్రతినెలా ఏదో ఒక సామాజిక కార్యక్రమంతో ప్రజలకు అండగా నిలవడం వారి సేవలకు స్ఫూర్తిదాయకమని అన్నారు. కార్యక్రమంలో నిరుపేదలకు వంట పాత్రలు భోజనానికి కంచాలు, గ్లాసులు ఇవ్వడానికి రెడ్ క్రాస్ సొసైటీ అధ్యక్షులు హామీ ఇచ్చారు. రెడ్ క్రాస్ సేవలను గుర్తించి శ్రీరాములను ఎమ్మెల్యే సన్మానం చేశారు. కార్యక్రమంలో కురుపాం ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, నియోజకవర్గ మహిళ కార్యదర్శి వెంపటాపు భారతి, ఎపిఆర్ఎస్ ప్రిన్సిపల్ యుగంధర్, విశ్రాంత హెచ్ఎంలు జగన్నాథరాథో, గుడ్ల హరిప్రసాద్, రెడ్ క్రాస్ సభ్యులు పైడా కొండలరావు, దొరబాబు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఎపిఆర్‌జెసి, ఎపిఆర్ఎస్‌సిఎటి ప్రవేశ పరీక్షలు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయని డిఇఒ యు.మాణిక్యం నాయుడు తెలిపారు. ఎపిఆర్ఎస్‌సిఎటి పరీక్షకు 1288 మంది హాజరు కావాల్సి ఉండగా 1064 మంది హాజరయ్యారు. ఎపిఆర్‌జెసి ప్రవేశ పరీక్షకు 2104 మందికి గాను 1891 మంది హాజరయ్యారు. 213 మంది గైర్హాజరయ్యారు. ఎపిఆర్‌డిసి డిగ్రీ ప్రవేశ పరీక్షకు 77 మందికి గాను 65 మంది హాజరయ్యారు.

నిరసన తెలుపుతున్న గిరిజన సంఘాల నాయకులు; మృతుని కుటుంబీకులు

పారిశుధ్య కార్మికుని కుటుంబానికి న్యాయం చేయాలి

ప్రజాశక్తి -భామిని

మండలంలోని తాలాడలో ఇటీవల అనుమానాస్పదంగా మృతి చెందిన పారిశుధ్య కార్మికుడు గొర్ల భీముడు కేసును పోలీసులు క్షేత్రస్థాయిలో ఛేదించి, దోషులకు త్వరగా శిక్ష పడేలా పని చేయాలని శ్రీకాకుళం జిల్లా గిరిజన ఐక్యవేదిక అధ్యక్షులు, రాష్ట్ర గిరిజన జెఎసి ఉపాధ్యక్షులు సిహెచ్.శాంతారావు కోరారు. ఈ మేరకు భీముడు కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ తాలాడలో గిరిజన ఐక్య వేదిక, ఎరుకుల సంఘం నాయకులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ భీముడు మరణించి రెండు రోజులు కావస్తున్నా దోషులను పట్టుకోవడంలో పురోగతి లేదని, ఈ స్థితి పట్ల స్థానిక ఎరుకుల కుటుంబంలో తీవ్ర భయాందోళన గురవుతున్నారని, ఉన్నతాధికారులు ఈ అంశంలో చొరవ తీసుకొని ఈ మరణంపై పూర్తిస్థాయి దర్యాప్తు నిర్వహించి, దోషులను కఠినంగా శిక్షించాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఈ అంశం పిఒ దృష్టికి కూడా తీసుకెళ్లామని, బాధిత కుటుంబానికి న్యాయం జరగకపోతే పై స్థాయి కూడా వెళ్లడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమం ఎరుకుల సంఘం నాయకులు గేదెల సురేందర్, గొర్లె బుల్లోడు ఉన్నారు.

గిరి వెలుగులో ఖర్చులపై దర్యాప్తు చేపట్టాలి

ప్రజాశక్తి - కొమరాడ

అడవి తల్లి సాక్షిగా ఐటిడిఎ గిరి వెలుగులో ఖర్చు పెడుతున్న నిధులపై ఇప్పటికైనా పూర్తిస్థాయిలో దర్యాప్తు చేపట్టాలని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక విలేకరులతో ఆయనతో పాటు ఎపి గిరిజన సంఘం నాయకులు వెంకటేష్ మాట్లాడారు. ఐటిడిఎ పరిధిలో గిరి వెలుగుకు సంబంధించి 8మండలాల్లో గల సుమారు 58 విడివికెల్లో కేంద్ర ప్రభుత్వం నుండి వచ్చిన నిధులకు సంబంధించి ఎంత ఖర్చు పెట్టారు ఎంత మిగిలింది ఎంత లాభం వచ్చింది ఒక్కో విడివికెలకు ఎంత డబ్బులు ఖాతాలు వేశారన్న విషయం పూర్తి వివరాలు అధికారులు వెల్లడించాలని కోరారు. సుమారు 8 యంత్రాలు, వివిధ వస్తువులు కొనుగోలు చేసేలా కొన్నారని, ఈ యంత్రాలు ఇప్పుడు ఎక్కడ ఉన్నాయి, ఎన్ని పనిచేస్తున్నాయి, త్రీఫేస్ కరెంటు ఎక్కడెక్కడ ఉన్నాయో విచారణ చేపట్టాలని కోరారు. 36 ల్యాబ్ ట్యాబులు కూడా ఎక్కడున్నాయో తెలియని పరిస్థితి ఉందని తెలిపారు. 2019 కి సంబంధించి ధాన్యం కొనుగోలు కేంద్రాల నుండి మహిళలకు వచ్చిన కమిషన్ ఎంత, ఒక్కొక్క మహిళా సంఘానికి ఎంత కమిషన్ డబ్బులు ఇచ్చారనే విషయాన్ని నిగ్గు తేల్చాలని కోరారు. 2024లో జీడిపిక్కలు ఎక్కడెక్కడ కొనుగోలు చేశారు, ఎన్ని కొనుగోలు చేశారనే విషయాన్ని స్పష్టంగా తెలిపాలని కోరారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో విచారణ జరిపి ప్రభుత్వ నిధులను దుర్వినియోగం కాకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు కైలాస రామారావు పాల్గొన్నారు.